## క్లుప్తంగా

### మంత్రులకు వినతి



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ముస్లిం నూర్బష్, దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దాసాహెబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పలువురు మంత్రులకు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. హోం మంత్రి మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తోపాటు ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌లను కలిశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

### రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

ఖమ్మంరూరల్: సానియో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఏదులాపురం, ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, మద్దులపల్లి, పల్లెగూడెం, ఆరెంపులలో 300 మందికి రగ్గులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు వి.విజయారెడ్డి, సభ్యులు పి.అవినాష్, పి. నర్సింహారావు, సిద్దు, చక్రవర్తి, పవన్‌రెడ్డి, లక్ష్మణ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కామేపల్లి(కారేపల్లి): గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్రేస్ సర్వీస్ సొసైటీల ఆధ్వర్యంలో కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 500మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ పట్ల పలువురికి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గాజ్యోతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, ఉపసర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**నేడు ఉచిత వైద్యశిబిరం**

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత మెగా ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మెంటం రామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు కావునా చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజలందరూ ఈ చక్కని అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేన్సర్‌పై అవగాహన సదస్సు ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ముదురుతున్న దారి పంచాయితీ

**రెండేళ్లుగా బీళ్లుగా మారిన గిరిజనుల భూములు**

- కలెక్టర్ ఆదేశించినా స్పందించని అధికార యంత్రాంగం
- నిరసనగా ఈనెల 9న మండల దిగ్బంధానికి పిలుపు



ధర్నా చేస్తున్న గిరిజనులు(ఫైల్)



సాగు చేయకుండా వదిలేసిన పొలాలు

నేలకొండపల్లి: మొన్నటివరకు సాగు చేసుకున్న భూములు రెండేళ్ల నుంచి సాగులేకుండా బీళ్లుగా మారాయి. దారిని ఆక్రమించారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. దారి ఇవ్వాలని కోరుతూ బాధిత రైతులు ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని దీంతో నిరసన తీవ్రతరం చేసేందుకు కార్యచరణ ప్రకటించారు. దారి పంచాయితీ చిలికి చిలికి గాలివానగా మారింది. ఏకంగా మండలాన్ని దిగ్బంధం చేసేందుకు గిరిజనులు పిలుపునిచ్చారు. మండలంలోని తిరుమలాపురంలో 30 మంది గిరిజన రైతులకు 55 ఎకరాలు సాగులో ఉంది. చాలాకాలం వరకు ఆ రహదారి నుంచి రైతులు వెళ్లి సాగుచేసుకున్నారు. రెండు పంటలు పండించి జీవనం కొనసాగించారు. రెండేళ్ల నుంచి ఆ ప్రాంతంలో ఉన్న కొంత మంది రహదారిని ఆక్రమించి, రైతులను వెళ్లనీయకుండా కంచె అడ్డువేశారని ఆరోపించారు. దీంతో రెండేళ్ల నుంచి 55 ఎకరాలు సాగు లేకుండా బీడుగా మారింది. ఈ భూముల తోనే కుటుంబ పోషణ, పిల్లల చదువులతో జీవనం సాగిస్తున్నారు. రెండేళ్ల నుంచి సాగు లేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. జీవనం కష్టంగా మారిందని, గిరిజనులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఇటీవల ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చివరకు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సర్వేయర్ అధికారులు సర్వే చేసి చేతులు దులుపుకున్నారు. వీరికి మాత్రం దారి సమస్య తీరలేదు. గిరిజన భూముల చుట్టూ పక్క రైతుల పొలాలు పచ్చటి పంటలు సాగు అవుతుండగా, వీరి పొలాలు మాత్రం బీళ్లుగా మారటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

**చావో రేవో తేల్చుకునేందుకు గిరిజనులు..**

తిరుమలాపురంలో బీళ్లుగా మారిన పంట పొలాలను సాగు చేసుకునేందుకు దారి పంచాయతీ పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆరోపిస్తూ ఈ నెల 9న మండలాన్ని దిగ్బంధం చేసేందుకు కార్యచరణ రూపొందించారు. 33 అడుగుల రోడ్డు ను విడగొట్టి అప్పగించాలని, గ్రామ కంఠం నాలుగెకరాలు భూమిని తిరిగి పంచాయతీకి అప్పగించాలి, ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన 20 కుంటల భూమిని పంచాయతీకి అప్పగించాలని కోరుతున్నారు. ఈ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు నేలకొండపల్లి మండలాన్ని దిగ్బంధం చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు మండలం లోని అన్ని పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు కోరుతున్నారు. విస్తృతంగా ప్రచారం చేపట్టారు. దారి సాధనకు చావో...రేవో తెల్చుకుంటామని హెచ్చరిస్తున్నారు.

**మా గోడు అర్థం చేసుకోవాలి**



మాకు ఉన్న కొద్దిపాటి భూమిని కూడ సాగు చేసుకోకుండా పెద్దలు దారిని ఆక్రమించారని వాపోయారు. మా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. రెండేళ్ల నుంచి పంటలు లేక పస్తులు ఉంటున్నాం. అధికారులు మా గోడును అర్థం చేసుకోవాలి.

– భూక్యా రవికుమార్, బాధిత రైతు, తిరుమలాపురం

**మేము ఎలా బతకాలి**



దారిని మూసేస్తే తాము ఎలా సాగు చేసుకోవాలి. ఎట్లా బతకాలి ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ సమస్యను పట్టించుకోవటం లేదు. దిగ్బంధంతోనైనా అధికారులు స్పందిస్తారో లేదా చూస్తాం. ఎంతటి వరకైనా పోరాటాం చేస్తాం. మా సమస్యను పరిష్కరించుకుంటాం.

– బాణోత్ భారతి, బాధిత రైతు, తిరుమలాపురం

**చావో.. రేవో తేల్చుకుంటాం**



మా సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న చేపట్టిన మండలం దిగ్బంధంలో కుటుంబ సభ్యులు అంతా పాల్గొంటాం. సమస్యను పరిష్కరించకుంటే చావో.. రేవో అక్కడే తెల్చుకుంటాం. అధికారులు స్పందించాలి. న్యాయమైన సమస్యను పరిష్కరించాలి.

– భూక్యా వెంకటేశ్వరరావు, బాధిత రైతు

**పరిష్కరించేందుకు పరిశీలిస్తున్నాం**



తిరుమలాపురం దారి పంచాయతీ సమస్యను పరిష్కరించేందుకు పరిశీలిస్తున్నాం. పాత నక్షలో దారి ఉన్న మాట వాస్తవమే కానీ కొత్త నక్షాలో దారి కనిపించటం లేదు. క్షేత్ర స్థాయిలో సర్వే చేశాం. ఇరువర్గాలతో చర్చించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్య తీసుకుంటున్నాం.

– దారా ప్రసాద్, తహసీల్దార్, నేలకొండపల్లి

### రైతుల రుణాలు మాఫీ చేయాలి

తిరుమలాయపాలెం: బీఆర్ఎస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రైతాంగ రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బచ్చోడులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బ్యాంకుల్లో రుణాలు మాఫీ కాక రైతులు అప్పులు వడ్డీలు పెరిగి లక్షల్లో అప్పులు పెరిగిపోయాయని, ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. విద్యుత్ కోతలతో రైతులు విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక పొలాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఒత్తిడి తగ్గించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: విద్యార్థులు తమ భవిష్యత్‌ను ఎలా తీర్చిదిద్దుకోవాలని, ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్లాలనే అంశాలపై నవభారత యువ చైతన్య సమితి యూత్ క్లబ్ సోషల్ వర్కర్ తాటిల్లి సుధీర్, మోటివేట్ ట్రైనర్ సురేందర్‌లు వివరించారు. ఆదివారం నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు లోకల్ థీమ్ బేస్ట్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుకునే సమయంలో ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు షారుక్, ఇమ్రాన్, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

## పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న మాధవరావు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల మాధవరావు అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అక్రమ పద్ధతులకు పాల్పడుతున్న ఉపాధ్యాయులపై కఠినంగా వ్యవహరించాలని, పదోన్నతులు ఇచ్చిన సమయంలో తిరస్కరించిన వారి సమాచారాన్ని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. 317జీఓతో బదిలీ అయి వేరే జిల్లాలకు వెళ్లిన సెకండరీ గ్రేడ్, పండిట్స్ స్పౌజ్ లను వెంటనే మాతృజిల్లాకు కేటాయించాలన్నారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వరప్రసాదరావు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలోనాయకురాలు బి జానకి రాణి, గోపాల రావు, ఆరుణాకర్, రాము, అశోక్, ఐజాక్, పుల్లారావు, అన్నమ్మ, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

### రిలే నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంరూరల్: గ్రామంలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండలంలోని మద్దులపల్లిలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమేష్ మాట్లాడుతూ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మద్దులపల్లిలో ప్రజలు పలు సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఇందిరమ్మకాలనీ ఇళ్లు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయే తెలియని దుర్భర పరిస్థితుల్లో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వెంటనే కాలనీవాసులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షకు న్యూడెమోక్రసీ సంఘీభావం తెలిపింది. ఈ కార్యక్రమంలో నాయకులు నండ్ర ప్రసాద్, టి.నాగయ్య, మధుబాబు, సతీష్, నరేందర్, బి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### నిందితులను శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బహుజన న్యాయవాద దంపతులైన మోజెస్ కృష్ణఫర్, అనురాధలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు కోరారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ గవర్నర్ కార్యాలయంలో సీడీ పెన్‌డ్రైవ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, కో కన్వీనర్‌లు రహమాన్, భద్రూనాయక్, పద్మాచారి, సంజీవరావు, వెంకటరమణ, అఖిల్, ఉపేంద్రనాయక్, పద్మాచారి, శ్రీనివాస్, రామదాసు, రమ్య, మస్తాన్, శ్రీనివాసరెడ్డి, చిట్టిమల్లు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ కార్యాలయంలోకి వినతిపత్రం అందజేయటానికి వెళ్తున్న నాయకులు

### ఎంపీ పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల తల్లిని కోల్పోయిన ఖమ్మానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శీలం పాపారావును, ఆయన కుటుంబ సభ్యులను శనివారం ఎంపీ నామ నాగేశ్వర రావు పరామర్శించారు. పాపారావు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రి యాదవ్ తదితరులు ఉన్నారు.

### మోడల్ ప్రశ్నాపత్రం ఆవిష్కరణ



పశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌కు చెందిన సివిక్ సెంటర్, జెఎస్ఆర్ స్టడీ హాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్–2 మోడల్ ప్రశ్నాపత్రాన్ని గీతాంజలి డిగ్రీ కళాశాల డైరెక్టర్ హన్మంతరావు ఆదివారం నగరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా కేంద్రాల బాధ్యులు మనోజ్, రామారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



టీ షర్టులు పంపిణీ చేస్తున్న ఎస్సైలు

రఘునాథపాలెం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయని రఘునాథపాలెం ఎస్సై ఎం.రవి, క్రైం బ్రాంచి ఎస్సై బి.నరేష్ అన్నారు. ఆదివారం మండలంలోని వీవీపాలెంలో ఎస్టీ కాలనీ, ఏస్టీకాలనీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మహా శివరాత్రిని సందర్భంగా నిర్వహించిన క్రీడల సభలో వారు మాట్లాడుతూ పోటీలలో గెలుపోటములు సహజమని ప్రతీ ఒక్కరు క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు నిర్వహించేందుకు కమిటీ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యరగర్ల హన్మంతరావు, ఉపసర్పంచ్ లాలిసింగ్, ఆత్మ డైరెక్టర్ బి.కిమా, బీఆర్ఎస్ మండల కార్యదర్శి రామోజీ, ఎం.శంకర్, బి.చిన్న, జి.లాలుకుమార్, ఎం.అశోక్, బి.శివ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కందాల



కూసుమంచి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఉదయం 8 గంటల నుంచే పలు వార్డుల్లో పర్యటించారు. వార్డుల నుంచి ప్రజలను అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలను కలుస్తూ వారి గోడు వింటూ సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ ముందుకు సాగారు. ప్రజలు చెప్పిన సమస్యలను విని సంబంధిత అధికారులకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అందుతున్నాయా లేదా ఏదైనా ఇబ్బందులు ఉంటే తనకు నేరుగా చెప్పవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ లీలాప్రసాద్, మార్కెట్ కమిటి చైర్మన్ శాంత, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, పీఆర్‌డీఈఈ శివగణేష్, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివ, సర్పంచ్ రాయపూడి నవీన్, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

**అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు**

కూసుమంచి: నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) పాలేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి ఇళ్ల స్థలాల సమస్యపై వినతిపత్రం అందజేశారు. జర్నలిజం వృత్తిలో ఉన్న తమకు ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదని, తమకు స్థలాలు వచ్చేలా చూడాలని యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని జర్నలిస్టులకు అవసరమైన ఇండ్ల స్థలాలలను త్వరలో ఇప్పించేందుకు తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ డీ.కర్ణ, కార్యదర్శి నంద్యాల ఉపేందర్, అధ్యక్షుడు అచ్యుతరామారావు, నాయకులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న వీరునాయక్

రఘునాథపాలెం: రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి, వేగవంతంగా పూర్తి చేయాలని సుడా డైరెక్టర్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆజ్మీరా వీరునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని హర్యాతండ పంచాయతీలోని జేత్యాతండా గ్రామంలో రూ.42 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండలంలో ప్రత్యేక దృష్టి పెట్టి తండాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కోటా నిధులు మొత్తం మండలంలో గ్రామాల అభివృద్ధికి ఖర్చుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అటెన్షన్ ప్లీజ్



## కంపు కొడుతోంది..!



మండలకేంద్రంలోని డ్రైయినేజీలు వ్యర్థాలతో కంపుకొడుతున్నాయి. చికెన్, మటన్ దుకాణాల నుంచి మిగిలిపోయిన వ్యర్థాలను డ్రైయినేజీలోకి వదలటంతో అవి కుళ్లిపోతున్నాయి. ప్రజలు దుర్గంధంతో, కంపు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడక ముందే స్పందించి వ్యర్థాలను వేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నేలకొండపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : దేవేందర్, పంచాయతీ కార్యదర్శి, నేలకొండపల్లి
సెల్ నంబర్ : 6302858241

### వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కూసుమంచి: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జీళ్లచెరువు దేవస్థానంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణం కనుల పండువగా సాగింది. ఈ కల్యాణంలో పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణ క్రతువును జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామానుజా చార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞికులు వెలగలేటి రామానుజా చార్యుల బృందం స్వామి వారు కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో శ్రీవారి గ్రామసేవను నిర్వహించాచు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమా, ఆలయ చైర్మన్ బొడ్డు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | రైటర్ పద్మభూషణ్ |
| వినోద | మైకేల్ |
| సాయిరాం | వీరసింహారెడ్డి |
| ఆదిత్య | పఠాన్ |
| శ్రీనివాస | వాల్తేరు వీరయ్య |
| సుందర్ | రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం |

- ఖమ్మం గాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 20 | బచ్చలికూర | 2 |
| వంకాయ | 20 | | 10 |
| బెండకాయ | 60 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 26 | | 20 |
| కాకర | 30 | చుక్కకూర | 2 |
| బీర | 40 | | 10 |
| దొండ | 16 | తోటకూర | 2 |
| పొట్లకాయ | 40 | | 10 |
| చిక్కుడు | 76 | గోంగూర | 2 |
| గోరుచిక్కుడు | 46 | | 10 |
| క్యాబేజీ | 14 | మెంతికూర | 5 |
| క్యాలీఫ్లవర్ | 30 | | 20 |
| ఆలుగడ్డ | 26 | కొత్తిమీర | 1 |
| చామగడ్డ | 64 | | 20 |
| క్యారెట్ | 26 | పుదీన | 1 |
| క్యాప్సికం | 44 | | 20 |

–ఖమ్మం వ్యవసాయం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 9959124151 మధిర సిహెచ్. వీరబాబు - 9849864638
పాలేరు ఎం. రామకృష్ణ - 8522039990 సత్తుపల్లి జి. బాబు - 7997958225
వైరా ఎ. రమేష్ - 9059115968 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
ఎన్. నాగశేషు - 99122 20600
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎన్. శేషయ్య - 99121 99148
ఎస్.కె. పాషా - 97054 44182
పి.నందకుమార్ - 90102 99957